దక్షిణాసియా

# భారత పాకిస్తాన్ చర్చలు : గతీ, గమ్యం

**- కె. బాలగోపాల్**

భారత పాకిస్తాన్ చర్చల కొక ప్రత్యేక లక్షణం ఉంది. ామూలుగా ఏవయినా రాజకీయ సంభాషణలు లేక సమస్యలపైన ర్చలు జరుగుతుంటే అందరి దృష్టీ వాటి ఫలితంపైన ఉంటుంది. లితం కోసం, సమస్యల పరిష్కారం కోసం చర్చలు అనేది సాధారణ ఖరి.

కానీ భారత పాకిస్తాన్ చర్చలు చర్చల కోసమేనంటే ితిశయోక్తి కాదు. ఈ రెండు దేశాల సరిహద్దు వెంబడి బతికే ప్రజలకు ర్చలు అంటే శాంతి అని అర్థం. వాళ్ల ప్రాణాలు, బతుకులు భద్రంగా ంటాయని అర్థం. ఈ సరిహద్దు 900 కిలో మీటర్ల పొడవు ఉంది ాబట్టి, దాని వెంబడి రెండు వైపులా లక్షల మంది జనం బతుకుతున్నారు ాబట్టి, ఇది చిన్న విషయంకాదు. ఈ రెండు దేశాలు చర్చించి చర్చించి ివరికి ఏ పరిష్కారమూ సాధించకున్నా, ఆ చివరి ఘడియను ానియ్యకుండా సాగనిస్తుంటే చాలు జనం బతికిపోతారు.

చర్చలు అంటే అణుయుద్ధం ప్రమాదం తాత్కాలికంగా ాయిదా పడ్డట్టే. ఇది భారత పాకిస్తాన్ చర్చలకు ఉండే రెండవ ుత్ఫలితం. ఇది చిన్నమేలు కాదు. అణుబాంబులున్నంత మాత్రాన ుయోగిస్తారని భయపడనక్కరలేదని వేరే ఏదయినా సందర్భంలో ునుకోవచ్చునేమోగానీ ఈ రెండు దేశాల విషయంలో మట్టుకు కాదు. ిరు వైపులా పిచ్చివాళ్లకు కొదవ లేదు. యుద్ధం చేసి 'పాకిస్తాన్‌ను ిలిపేసుకోవాలని లేదా కనీసం, "పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్' ను ిలిపేసుకోవాలని - ఉబలాటపడే వాళ్లు ఇక్కడ, భారత్‌వల్ల రాగల ుమాదాన్ని శాశ్వతంగా తొలగించేసుకోవాలని - లేదా కనీసం 'భారత్ ఆక్రమిత కాశ్మీర్'ను కలిపేసుకోవాలని ఆరాట పడేవాల్లు అక్కడ, చాలా ుందే ఉన్నారు. పిచ్చాసుపత్రులలో కాదు, బయటే ఉన్నారు. ుర్ణయాత్మకమైన పదవులలోనూ ఉన్నారు. ప్రజాభిప్రాయాన్ని బలంగా ుభావితం చేయగల స్థానాలలో దండిగా ఉన్నారు.

మూడవది, యుద్ధానికి నిత్యం తయారుగా ఉండడానికయ్యే ఖర్చు తగ్గడం. భారత్ ఈ తయారీమీద రోజుకు 6 కోట్ల రూపాయలు (సంవత్సరానికి కాదు, నెలకు కాదు, వారానికి కాదు, రోజుకు) ఖర్చు పెడుతున్నదన్నది చాలాకాలంగా ఉన్న అంచనా. చర్చల సందర్భంగా నెలకొన్న యుద్ధవిరమణ కారణంగా ఇది మొత్తం మిగలకున్నా, ఇందులో సగం మిగిలినా సంవత్సరానికి వెయ్యికోట్ల రూపాయలు మిగిలినట్టే. అంటే మొత్తం పాకిస్తాన్‌కూ మిగులుతుంది. ఈ దారిద్ర్య స్థావరాలకు అది చిన్న మిగులు కాదు.

నాలుగవది, నిరర్థకమైన చావులు ఆగడం. ఊరికే సరిహద్దు వెంబడి జరుపుకునే కాల్పులలో జవాన్లు నిత్యం చస్తుంటారు. సియాచెన్‌లోనయితే ఒక్క తూటా కాల్చకున్నా చలికే చస్తున్నారు. అత్యంత నిబ్బరం గల జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు సహితం బతక జాలని చోట యుద్ధం చేసుకోవడమేకాక, ఆమంచు ఎడారిని ప్రపంచంలోని అతి ఎత్తయిన యుద్ధక్షేత్రంగా మార్చుకుని ఈ రెండు దేశాలు అదేదో గర్వకారణమైనట్టు చెప్పుకొంటున్నాయంటే, చచ్చేది వేరే వాడయితే ఎంత పిచ్చిగానయినా వ్యవహరించగలం అని అర్థం అవుతుంది. దానికొక 'శాంతివనం'గా మార్చే ఆలోచన ఉందని అంటున్నారు. ఆ పనిచేసి అక్కడికి టూరిస్టులు గుర్రాలో, గాడిదలో ఎక్కి బయలుదేరి పోయి దారిలో కొండచరియలు కూలడం వల్లనో మంచు తుఫానులు కురవడం వల్లనో చావడం, ఆ వార్తలు మనం చదవడం ఎందుకు? మనుషులు రావద్దని ప్రకృతి ఉద్దేశించిన చోటికి పోయి యుద్ధం చేసుకోవడమెందుకు? ఆ తరువాత దానిని శాంతివనంగా మార్చడమెందుకు? రెండు సైన్యాలు సామాన్లు సర్దుకొని కిందికొచ్చేస్తే చాలు, ప్రకృతి లక్ష్యం నెరవేరుతుంది.

కాబట్టి కేవలం చర్చలు జరుగుతుండడం వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉండగలవు. చర్చలు జరుపుతూ జరుపుతూ అదే అలవాటయిపోతే - యుద్ధం చేస్తూ, చేస్తూ అదే అలవాటయి పోయినట్టు ఈ ప్రయోజనాలు శాశ్వతం కాగలవు. అదీపదివేలే.

ఎందుకంటే చర్చలు అజెండా విషయంలోని ప్రతిష్ఠంబన వీడడం లేదు. పాకిస్తాన్‌కు ఈ విషయంలో స్పష్టత ఉంది. (పాకిస్తాన్ పాలకులు మనవారికంటే విజ్ఞులని కాదుగానీ వివేకం స్వప్రయోజనంతో ఏకీభవించినప్పుడు స్పష్టత కొరవడవలసిన అవసరం లేదు) భారత పాకిస్తాన్‌ల మధ్య కాశ్మీర్ సమస్యే ప్రధాన సమస్య కాబట్టి, అదే అజెండాలోని ప్రధాన అంశం కావాలని పాకిస్తాన్ అంటుంది. నిజానికి అది కాక ఈ రెండు దేశాల మధ్య వేరే ఏ సమస్యలున్నాయి? సింధూనది జలాలను న్యాయబద్ధంగా పంచుకోవడం, ఒకరికొకరు వర్తక వ్యాపారాలలో ప్రాధాన్యం ఇచ్చుకోవడం, ఇవేవీ తలలు పగల గొట్టుకోవలసిన సమస్యలు కాదు. కాశ్మీర్ సమస్యే అసలు సమస్య. అసలు సమస్యను మొదట పరిష్కరించుకుంటే మిగిలినవి వాటంతటవే పరిష్కారం అవుతాయి కాబట్టి, కాశ్మీర్ తోనే మొదలు పెడదాం అని పాకిస్తాన్ అంటుంది.

భారత్‌కు ఈ విషయంలో ఒక స్పష్టమైన వైఖరే లేదు. అసలు సమస్య జటిలమైనది కాబట్టి దానిని వాయిదా వేసి పరిష్కారం కాగల సమస్యల గురించి మాట్లాడు కున్నట్టయితే అసలు సమస్య చర్చించ డానికి కావలసిన సుహృద్భావ వాతావరణ ఏర్పడుతుందని ఒక్కొక్కసారి అంటుంది. అసలు కాశ్మీర్ సమస్య సమస్యకాదనీ, మహారాజు హరిసింగ్ 1947 అక్టోబర్ 26న జమ్ముకాశ్మీర్ రాష్ట్రాన్ని ఇండియాలో కలపడానికి అంగీకరించి నప్పుడే అది పరిష్కారం అయిపోయిందనీ, పరిష్కారం అయిపోయిన సమస్యను తిరగతోడడం కోసం కాశ్మీర్‌లోనికి పాకిస్తాన్ చొరబాటు దార్లను పంపించడమే ప్రస్తుతమున్న 'కాశ్మీర్ సమస్య' అనీ ఒక్కొక్కసారి అంటుంది.

ఇది నిజ.మని నిజంగా నమ్మివుంటే భారత్ చర్చలకసలు

ఒప్పుకునేదే కాదు. నిజాన్ని గుర్తించినప్పటికీ దానిని ముందుంచకుండా కల్పనను ముందుంచడం ఎత్తుగడ రీత్యా తెలివయిన పనిగా భారత్ భావిస్తున్నది కాబట్టి అదే వైఖరి కొనసాగిస్తున్నది.

అయితే ఇప్పుడు రెండు దేశాలూ ఏ సమస్యముందు చర్చిస్తామని చెప్పకుండా అన్ని విషయాలు చర్చిస్తాం' అని అంటున్నాయి. పాకిస్తాన్ 'జమ్ముకాశ్మీర్‌తో సహా' అని ఆవాక్యం మొదట చేరుస్తున్నది. భారత్ ఆ మాటలు చేర్చకున్నప్పటికీ, పాకిస్తాన్ చేర్చడం పట్ల అభ్యంతరం చెప్పడంలేదు. దీని అర్థం కాశ్మీర్‌ను ఒక సమస్యగా భారత్ గుర్తించి నట్టేనని పాకిస్తాన్ పాలకులు తమ దేశీయ విమర్శకులకు నచ్చ చెప్తుతుండగా, కాశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగమని వేరే సందర్భాలలో ప్రకటించడం ద్వారా అటువంటిదేమీ లేదని భారత్ తన దేశీయ విమర్శకులకు సర్దిచెప్తుతున్నది.

భారత పాకిస్తాన్ చర్చలు ఎక్కడిదాకా వచ్చాయంటే ఇదిగో ఇక్కడి దాకా వచ్చాయి. 'అసలు విషయం' అనేది ఒకటి ఉందా లేదా, అది నిజమైన సమస్యా లేక జిహాదీలు కల్పించిన సమస్యా అన్న విషయంలో ఏకాభిప్రాయం కుదరకుండానే రెండు దేశాల అధికారులూ అప్పుడప్పుడూ కలుసుకుంటూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. మనమంతా ఒకలాంటి మనుషులమే కదా అని మళ్ళీ మళ్ళీ కనుక్కుంటున్నారు. రెండు దేశాల విదేశాంగ శాఖ మంత్రులూ వేరే ఏవో సందర్భాలలో ఎక్కడెక్కడో కలుసుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకుంటున్నారు.

ఇట్లాగే సాగుతున్న ఈ ప్రక్రియ పూర్తిగా నిరర్థకమని భావించనక్కరలేదనడానికి కారణంపైన చెప్పాను. అది ఆగిపోకుండా కొనసాగాలంతే. అయితే నిర్దిష్టమైన ఫలితాలేవీ దీనినుండి రావని కూడ అనలేం. రెండు దేశాలకూ అవసరమయినవి కొన్ని ఉన్నాయి. ఇరాన్‌నుండి భారత్‌కు గ్యాస్ పైప్‌లైన్ వేయాలన్నది ఒకటి. అది ఇరాన్‌కూ భారత్‌కూ అవసరం. రెవెన్యూరీత్యా పాకిస్తాన్‌కు ఇష్టమే. కానీ పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశంలో సమాంతర పాలన సాగిస్తున్న ఇస్లామిక్ మిలిటెంట్ల నుండి ఆ పైప్‌లైన్‌కు భద్రత కల్పిస్తుందా అన్నది భారత్ భయం. కల్పించగలుగుతామని పాకిస్తాన్ హామీ ఇస్తున్నది. ఈ విషయం, ఆర్థిక సహాయ సహకారానికి సంబంధించిన ఇటువంటి ఇతర విషయాలు కొలిక్కిరాగలవు.

ఇక్కడే పాకిస్తాన్‌కు కొన్ని న్యాయమైన సందేహాలున్నాయి. అసలు విషయం చర్చించకుండ ఇవన్నీ మాట్లాడుకుంటూ పరిష్కరించుకుంటూ పోతే భారత్ అసలు విషయం చర్చిస్తుందా? తన అవసరాలన్నీ తీరిపోయిన తరువాత కాశ్మీర్ గురించి మాట్లాడేది లేదు పొమ్మని భారత్ అంటే అప్పుడేం చేయాలి? అందువల్ల ఇరాన్ పైప్‌లైన్ చర్చను వాయిదా వేసి భారత్‌పైన ఒత్తిడి పెంచాలని వాదిస్తున్న పాకిస్తానీలు ఉన్నారు. చిన్న చిన్న విషయాలు పరిష్కరించుకుంటూ పోతే అసలు విషయం మాట్లాడుకోవడానికి కావలసిన స్నేహవాతావరణం ఏర్పడుతుందని భారత్ చెప్పటం అతి తెలివి ఎత్తుగడ అని వారు అనుమానిస్తున్నారు.

కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ దృష్టి భారత్ దృష్టికంటే ఉన్నతమైనదేం కాదు కాబట్టి - ఇద్దరిదీ భూమి కబ్జా దారుల దృష్టే కాబట్టి - పాకిస్తాన్ పాలకుల భయాందోళనలకు పెద్దగా పట్టించుకోనక్కరలేదు. కానీ భారత్ ఆడుతున్న ఆటకు బలయ్యేది కాశ్మీరీలు,, కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారం ఆకాంక్ష. ఆ ఆకాంక్షను భారత్ గుర్తించ నిరాకరించడం, భారత పాకిస్తాన్‌లు రెండూ దానిని ఒక భూమి వివాదంగా మార్చడం అసలు 'కాశ్మీర్ సమస్య'. దీని పరిష్కారం కావలసింది ఇండియాకూ, పాకిస్తాన్‌కూ కాదు, కాశ్మీరీలకు.

భారత్ పాకిస్తాన్‌ల మధ్య పెరుగుతున్న స్నేహాన్ని కాశ్మీరీలు రెండు మనస్సులతో గమనిస్తున్నారు. స్వభావ రీత్యా చాలా స్నేహశీలురు కావడం వల్ల ఈ స్నేహాన్ని వారు ఆహ్వానించకుండ ఉండలేరు. తగిన వైద్య సదుపాయాలు దొరకని పాకిస్తానీ పిల్లలు బెంగుళూరు కొచ్చి ఆపరేషన్ చేయించుకోవడం, భారత్ క్రికెట్ జట్టును పాకిస్తాన్ ప్రజలు సాదరంగా ఆహ్వానించడం, ఎవరికయినా సంతోషం కలిగించే విషయాలే.

కానీ ఇది చివరికి ఎటు పోతుంది? ఈ రెండు దేశాలూ దగ్గరయి, వైద్యసదుపాయాల నుండి గ్యాస్‌పైప్‌లైన్ దాకా అన్నిటిలోనూ సహకరించుకోవడం మొదలు పెట్టిన తరువాత అదే వరవడిలో కాశ్మీర్‌ను కూడ చెరికొంచెం తీసేసుకొని వాస్తవాధీన రేఖవద్ద పూలకుండీలు అమర్చేసుకుంటే తమనేల భవితవ్యం ఏమవుతుంది? భారత్ కాశ్మీర్ గురించి పాకిస్తాన్‌తో అసలు చర్చించకుండ మిగలిన సమస్యలు పరిష్కరించుకుని కాశ్మీర్ విషయంలో ప్రస్తుత మొండి వైఖరినే కొనసాగిస్తుందన్న భయం పాకిస్తానీలలో ఎంతవుందో కాశ్మీరీలలోనూ అంతవుంది. కాగా, వారిలో రెండవ భయమూ ఉంది. ఈ రెండు దేశాలూ కూడబలుక్కొని గట్టుతగాదాలాగ పరిష్కరించేసుకుంటా యేమోనని, అమెరికా అభీష్టం ఇదేనని అందరికీ తెలుసును. వాస్తవాధీన రేఖనో, వేరొక సరిహద్దునో శాశ్వత సరిహద్దు చేసేసుకొని కాశ్మీర్ అధ్యాయానికి ముగింపు పలకాలని అమెరికా ఒత్తిడి పెడుతున్నది. అమెరికాకు కావలసింది శాంతి, న్యాయబద్ధమైన పరిష్కారం కాదు. భారత పాకిస్తాన్‌ల మధ్య ఏదో ఒక ప్రాతిపదికన శాంతి నెలకొంటే పాకిస్తాన్‌లోని ఇస్లామిక్ మిలిటెంట్ల ఉనికి దెబ్బతింటుందని అమెరికా ఆశ. 'అఫ్ఘానిస్తాన్ సమస్య' పరిష్కారం కోసం అమెరికాయే వారిని ఉనికిలోకి తెచ్చింది. ఇప్పుడు వారిని తొలగించడానికి 'కాశ్మీర్ సమస్యను పరిష్కారం చేయాలనుకుంటున్నది. ఈ రెండు దేశాలలోనూ యుద్ధమంటే విసిగిపోయిన వారంతా అమెరికా ప్రతిపాదనొక సులభమైన పరిష్కారంగా భావిస్తున్నారు. బహుశా చివరి పరిష్కారం ఆరూపంలోనే ఉండవచ్చు. కానీ అన్యాయమైన ఆ పరిష్కారానికి సహితం ఇండియా తొందర పడదు. దశాబ్దాల తరబడి కాశ్మీర్ మొత్తం మనదేనంటూ కృత్రిమంగా రెచ్చగొట్టిన జాతీయవాద ఆవేశాన్ని ఎదుర్కొనడానికి భారత పాలకులు సులభంగా సిద్ధపడరు. పాకిస్తాన్ పాలకులకు ఆ సమస్య ఉందిగానీ కాశ్మీర్‌ను చెరికొంత అనే ప్రాతిపదికన పంచేసుకునేటప్పుడు కాశ్మీర్‌లోయ తమకు దక్కుతుందన్న ఆశ వారిలో లేకపోలేదు. అందుకే వారు 'కాశ్మీర్ సమస్య అజెండాలో ఉండాలని తొందరపడుతున్నారు. ఇవన్నీ తెలిసే కాశ్మీరీలు ఈ మొత్తం 'చర్చల' వ్యవహారాన్ని అనుమానంగా చూస్తున్నారు. కానీ వారి భయాలను ఆలకించేవారెవరు?

☆ ☆ ☆